# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## పారా హుషార్ !

### నగరంలో పోలీసుల తనిఖీలు



తిరుపతికార్పొరేషన్,జనవరి 27ప్రభాతవార్త: తిరుపతినగరంలో ఆకతాయిలు, రౌడీ మూకలు, మందుబాబుల ఆగడాలను అణచి వేయడానికి, అసాంఘిక కలాపాలు అడ్డుకట్టకు తిరుపతి ఏఎస్పీ రవిమనోహరాచారి చర్యలకు ఉపక్రమించారు. ఈస్టుపోలీసుస్టేషన్ పరిదిలో లాడ్జీలు, విశ్రాంతి గృహాలు, ఆర్టీసి బస్టాండు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలుచేశారు. ఎవరు వస్తున్నారు, ఎవరు ఏమిటనే ఆరా తీశారు. జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు బాద్యతలు చేపట్టిన తరువాత తిరుపతిలో పోలీసు అధికారులు పలు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచారు. ఈ తనిఖీల్లో ఇన్‌ఛార్జి డిఎస్పీ శ్రీలత, ఈస్టు సిఐ పి,రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుకేతు పూజలు జరిపించుకున్న రష్యా దేశస్తులు



శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు దేశ విదేశీ భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా రష్యా,అమెరికా దేశస్థులు అధికంగా వస్తున్నారు. సోమవారం ఆలయంలో రష్యా దేశానికి చెందిన దంపతులు పూజలు చేయించుకుంటుండగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి వారిని పలకరించారు. ఆదరంగా గౌరవంగా పలకరించారు.ఇక్కడ ఏర్పాట్లు, పూజా విధానాల గురించి వాకబు చేసారు. ఎంఎల్ఏ వినమ్రతతను రష్యాదేశం దంపతులు ఎంతో సంతోష పడ్డారు.

## అందరి కళ్లూ

# జిఎస్ఎల్వి-ఎఫ్15 రాకెట్‌పైనే..





శ్రీహరికోట (తడ), జనవరి 27 ప్రభాతవార్త భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అత్యంత ప్రతిష్టాత్మక రాకెట్ ప్రయోగానికి సిద్ధమయింది. శ్రీహరికోట దీవిలో రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పడిన తర్వాత ఉపగ్రహాలను మోసుకెళ్లే రాకెట్ల సంఖ్య 100కు చేరనుంది. ఈ కీలక ప్రయోగం ఈ నెల 29న ఉదయం 6.23 గంటలకు జరగనుంది. జిఎస్ఎల్వి-ఎఫ్15 పేరుతో ఈ రాకెట్‌ను నిర్మించారు. భూ, జల, వాయు మార్గాలలో వాహన చోదకులకు ఉపయోగపడేందుకు నావిక్ రెండవ సిరీస్‌లో ఎన్‌విఎస్ 02 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. 2,250 కిలోల బరువు ఉన్న ఈ ఉపగ్రహం అంతరిక్షం నుంచి జిపిఎస్ తరహా సేవలను మన దేశానికి అందించనుంది. కేవలం మన భూభాగంలోనే కాకుండా చుట్టుపక్కల 1500 కిలోమీటర్ల దూరం ఈ సేవలు అందుతాయి. భూమి నుంచి 170 కిలోమీటర్ల పెరిజి, 36,577 కిలోమీటర్ల అపోజిల జియో స్టేషనరి ఆర్బిట్‌లో ఈ ఉపగ్రహం చేరి దేశానికి సేవలు అందిస్తుందని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. ఇటీవల ఇస్రోకు నూతన ఛైర్మన్‌గా నియమితులైన వి.నారాయణన్ ఆధ్వర్యంలో జిఎస్ఎల్వి-ఎఫ్15 ప్రయోగం జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక 100వ రాకెట్ ఆయనకు ఛైర్మన్‌గా తొలి రాకెట్ ప్రయోగం కావడం విశేషం. సోమవారం చెన్నై నుంచి శ్రీహరికోటకు చేరుకున్న వి.నారాయణన్ వివిధ అంతరిక్ష కేంద్రాల సందర్శనలు, గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ పరిశీలన, భవిష్యత్ ప్రయోగాలపై సమీక్షలతో క్షణం తీరిక లేకుండా గడిపారు. అనంతరం మిషన్ రెడీనెస్ రివ్యూ, లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశాల్లో పాల్గొన్నారు. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌కు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఇతర సీనియర్ శాస్త్రవేత్తలు స్వాగతం పలికారు. మరో రెండురోజుల పాటు ఆయన ఇక్కడే ఉండి రాకెట్ ప్రయోగాన్ని మిషన్‌కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షిస్తారు. శ్రీహరికోట నుంచి వందవ ప్రయోగం జరుగుతున్న కారణంగా షార్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఆసక్తి నెలకొంది. 5 దశాబ్దాల భారత అంతరిక్ష పరిశోధనలో ఇది ఒక కీలక ఘట్టంగా భావిస్తున్నారు.

# ఆ ఒక్క డిప్యూటీ కుర్చీ...ఎవరిదో పైచేయి!

### -తిరుపతిలో నగరపాలక కౌన్సిల్ రసవత్తర రాజకీయం షురూ!





ప్రభాతవార్త-తిరుపతి: 2021లో ఏదోలా ఎత్తుకు పై ఎత్తుతో వైసిపి జెండాపై గెలిచిన కార్పొరేటర్లు 48మంది...అందులో ఒక మేయర్ ,ఇద్దరు డిప్యూటీ మేయర్లు ,మిగిలిన 44మంది కార్పొరేటర్లు గాక మరో ఒకరు టిడిపి కార్పొరేటర్. ఒక డివిజన్ ఎన్నికలు జరగలేదు. వైసిపి కార్పొరేటర్ ఏడాదిన్నర క్రిందట హఠాణ్మరణంతో ఖాళీగా ఉంది. 2021 నుండి వైసిపి కౌన్సిలే నాలుగేళ్ళ పాలన పూర్తికావస్తోంది. గత ఏడాది ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ పదవికి రాజీనామా చేశాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఎనిమిది నెలల తరువాత పలు కారణాలతో ఖాళీగా ఉన్న కార్పొరేషన్‌ల మేయర్లు, ఉపమేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు/ఛైర్‌పర్సన్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడురోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయాలని కలెక్టర్లకు ఆదేశాలందాయి. ఫిబ్రవరి 3న పరోక్షపద్దతిలో ఆయా చోట్ల కుర్చీల భర్తీచేయాలని నిర్ణయం. దీంతో ఇప్పుడు తిరుపతి నగరంలో రాజకీయం వింతగా నడుస్తున్నా ,తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో నగరపాలక కౌన్సిల్‌లో ఖాళీగా ఉన్న ఒక డిప్యూటీమేయర్ ఎంపిక మరింత రసవత్తరంగా మారనుంది. తిరుపతిలో భూమన అభినయరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. గత కొంతకాలంగా తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో రాజకీయాలు నాటకీయపరిణామాలతో మారి ఏం జరగనుందనేది హాట్‌టాపిక్‌గా మారింది. ప్రస్తుతం తిరుపతిలో కూటమి జనసేన ఎంఎల్ఎ ఉన్నారు. అదేగాక కౌన్సిల్‌లో మేయర్ డాక్టర్ శిరీష,డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ వైసిపి జెండాపై గెలిచిన వారే. మరో 45మంది కార్పొరేటర్లు వైసిపి మద్దతుదారులే. అయితే గత కొంతకాలంగా 10మంది వరకు వైసిపి ఉపమేయర్ ముద్రనారాయణ ,కార్పొరేటర్లు నరసింహాచారి, పొన్నాలచంద్ర, అనిల్, దొడ్డారెడ్డి ప్రవళిక ,కుడితి సుబ్రమణ్యం, కుమారి , నరేంద్రనాథ్ కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధమయ్యారు.అయితే మరో 13నెలల్లో ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం ముగియనుంది. ఈ గందరగోళ,సందిగ్ద పరిస్థితుల్లో వైసిపిని వీడాల్సిన కార్పొరేటర్లు ఉత్సాహంగా కూటమిలోకి జంప్‌అయ్యేందుకు సిద్దంగా ఉన్నా అటు సిఎం చంద్రబాబు,ఇటు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాన్ కూడా సుముఖత చూపలేదు. మరీ ఇప్పుడు డిప్యూటీ మేయర్ పదవి భర్తీకి ముందే కార్పొరేటర్లు పార్టీని వీడి కూటమి జెండాతో పరోక్ష ఎన్నికలకు మద్దతుపలుకుతారా?లేక ఇంకో డిప్యూటీ మేయర్ వైసిపినే కైవశం చేసుకుంటుందా అనేది ఆసక్తికర పరిణామాలే.

### మన్నవరం వద్ద

## హెలికాప్టర్ల తయారీ కర్మాగారం

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, జనవరి 27, ప్రభాతవార్త ప్రాంతంలోని మన్నవరం గ్రామం సమీపంలో హెలికాప్టర్ల తయారీ కర్మాగారం వస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోనే ఆయన నివాస గృహంలో విలేకరులు సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్‌లు దావూస్ పర్యటనలో రాష్ట్రానికి 40 కర్మగారాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇందులో వెంకటగిరి సమీపంలోని బిహెచ్ఎల్ ఫ్యాక్టరీ పక్కనే హెలికాప్టర్ తయారీ కర్మాగారం ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చినట్లు తెలిపారు. వెంకటగిరి ప్రాంతంలో 40,000 ఎకరాలు పైన పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ భూములు ఉన్నట్లు తెలిపారు. వెంకటగిరిని పారిశ్రామిక కారిడారుగా ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబుని కోరుతానని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు స్థాపించకపోగా ఉన్న వాటిని ఇతర రాష్ట్రాలకు పంపించారని విమర్శించారు. 40 లక్షల ఉద్యోగాలు పరిశ్రమల స్థాపన ద్వారా సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ సంస్థ లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రాజేశ్వర రావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమోళి రెడ్డి, నాయకులు మంకు ఆనంద్, జనసేన నాయకుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పిఎం ఆవాస్ యోజన

## ఇళ్ళ నిర్మాణాలు సత్వరం పూర్తి

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త: జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద చేపట్టిన ఇళ్ళ నిర్మాణాల్లో భాగంగా వివిధ దశల్లో వున్న నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరం నుండి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గృహ నిర్మాణ పురోగతి, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, వేసవి దృష్టిలో వుంచుకుని సిద్ధం చేయాల్సిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 77,366 ఇళ్ళు మంజూరు అయ్యాయని, ఇందులో 49,321 పూర్తి అయ్యాయన్నారు. జనవరి 1 నుండి మార్చి 31వ తేదీ వరకు 7,331 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి లక్ష్యంగా వివిధ మండలాలకు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో ప్రస్తుతం 357 ఇళ్ళ నిర్మాణాలు మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలిన 6,954 ఇళ్ళు ఆర్‌సి, ఆర్ఎల్ స్థాయిలో వున్నాయని, ఈ నిర్మాణాలను పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ అధికారులు, ఎంపిడిఓలు సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. అలాగే హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియలో నమోదు కాని ఇళ్ళ నమోదు చేసే ప్రక్రియను ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రానున్న వేసవిని దృష్టిలో వుంచుకుని మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు వారి పరిధిలో గల మంచినీటి సరఫరాకు సంబంధించి పబ్లిక్ ట్యాపులు పని చేస్తున్నది లేనిది పరిశీలించడంతో పాటు మంచినీటి బోర్లలో ఎలాంటి సమస్య వున్నా వాటి మరమ్మత్తు పనులను సత్వరం చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మంచినీటి ట్యాంకు లను శుభ్రం చేసే ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు కచ్చితంగా చేపట్టేలా పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు అధికంగా కలుషిత నీరు తాగడం వల్ల వస్తుందని, వీటిని అరికట్టడానికి స్వచ్ఛమైన మంచినీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ ఇన్‌ఛార్జ్ పిడి గోపాల్‌నాయక్, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, హౌసింగ్ డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

### శాశ్వత ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు

## నా వంతు కృషి చేస్తా

### కలెక్టర్ వెంకటేశ్వర్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న మహిళా చిత్రకారులు

తిరుపతి హెల్త్, జనవరి 27 ప్రభాతవార్త : ప్రముఖ ఆధ్యాత్మిక, సందర్శక నగరమైన తిరుపతిలో ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు శాశ్వత గ్యాలరీ ఎంతైనా అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక ఉదయ్ ఇంటర్నేషల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తిరుపతికి చెందిన ఎనిమిది మంది మహిళా చిత్రకారుల బృందం శ్రీ పద్మావతి చిత్రాలయం పేరిట ఉమెన్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్యాలరీలో మహిళా ఆర్టిస్టులు ప్రదర్శించిన పెయింటింగ్స్‌ను ఆయన తిలకించారు. చిత్రకారులు కిరణ్‌కుమారి (స్టిల్ ఆర్ట్), గాయత్రీ దేవి (తంజావూరు),రాగిమాను శ్రీదేవి (సంప్రదాయ చిత్రకళ), బి.అర్చన (నిర్మల్, మధుబని), కలంకారీ (ఊర్మిళ), లావణ్య (మండల), సాయిదివ్య, జానకి (మోడన్‌ఆర్ట్)లు గీచిన చిత్రాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. చిత్రశైలి, నైపుణ్యం, చిత్రం గీసే విధానం, సమయం, వినియోగించే మెటీరియల్స్ చిత్రాలకున్న డిమాండ్ వంటి అంశాలను వారు కలెక్టర్‌తో పంచుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ సరికొత్తగాను, అబ్బురపరుస్తోందని కొనియాడారు. మహిళా చిత్రకారుల శ్రమను చూస్తుంటే చాలా ముచ్చటేస్తోందని, వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది చిత్రకారులు ఆసరగా తీసుకుని తయారు కావాలని పిలుపునిచ్చారు. నిత్యం ఇలాంటి ప్రదర్శనలు అందుబాటులో ఉండేలా శాశ్వత గాలరీ ఏర్పాటుకు ప్రభుత్వం తరపున సహాయ చర్యలు చేపట్టడంతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకుని వారిని ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాశ్వత గ్యాలరీ ఏర్పాటుకు టీటీడీ అధికారులతో చర్చిస్తానన్నారు. అనంతరం మహిళా చిత్రకారులు కలెక్టర్‌ను కలంకారి శైలిలో రూపొందించి న శాలువ కప్పి వారు గీసిన చిత్రాలను జ్ఞాపికగా అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆర్టిస్టులు సింగపల్లి సత్యనారాయణ , ఆనంద్, ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు హేమాద్రి ఆచారి, వేమన విజ్ఞాన కేంద్ర ప్రతినిధులు టెంకాయల దామోధరం, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం వ్యాఖ్యతగా పీలేరు ఖాదర్ భాషా వ్యవహరించారు.చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

# జిల్లాకు మరో 10 మద్యం షాపులు

### - కల్లు గీత కులాల వారి నుండి దరఖాస్తులు ఆహ్వానం



చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త: జిల్లాలో కొత్తగా మరో 10 మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయి. కల్లు గీత కార్మికుల ఉప కులాలకు మంజూరైన ఈ 10 మద్యం షాపులను వారికి మాత్రమే కేటాయించనున్నారు. ఈడిగ కులానికి ఏడు మద్యం షాపులు, గౌడ, గాండ్ల, గౌడ్ కులాలకు ఒకొక్క మద్యం షాపు కేటాయించడం జరిగింది. ఈ మద్యం షాపులు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, నగరి, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు రూరల్, గుడిపల్లి, వి.కోట మండలాల్లో ఏర్పాటు చేస్తున్న మద్యం షాపులు ఈడిగ కులస్తులు, పాలసముద్రం మండలంలో గౌడ, పెద్దపంజాణి మండలంలో గౌండ్ల, వెదురుకుప్పం మండలంలో గౌడ్ కులానికి కేటాయించారు. ఈ మేరకు ఈ షాపులకు సంబంధించి జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాసులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. మద్యం షాపుల కోసం దరఖాస్తుదారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్దతి ద్వారా ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు చేసుకోవచ్చునని తెలిపారు. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సమక్షంలో చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపంలో డిప్ పద్దతి ద్వారా షాపులను కేటాయించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు మద్యం షాపు దరఖాస్తు రుసుంగా 2 లక్షల రూపాయలు చెల్లించాల్సివుంటుందని, అలాగే దరఖాస్తుతో పాటు 2 పాస్‌పోస్టు సైజు ఫోటోలు, ఓటరు గుర్తింపుకార్డు లేదా డ్రైవింగ్ లైసెన్సు లేదా బ్యాంకు పాసుపుస్తకం లేదా పాస్‌పోర్టు లేదా ఆధార్ కార్డును జత చేయాల్సివుంటుందన్నారు. దరఖాస్తుదారులు కచ్చితంగా జిల్లాకు చెందిన వారై వుండాలని, వారి కులముకు సంబంధించిన ధృవీకరణ పత్రంతో పాటు స్థానిక ధృవీకరణ పత్రంను జత చేయాల్సివుంటుందన్నారు.

### పుంగనూరులో ఘరానా మోసం..

పుంగనూరు రూరల్, జనవరి 27, ప్రభాతవార్త పుంగనూరు పట్టణం కనకదుర్గ గోల్డ్ లోన్ బ్యాంక్‌లో ఘరానా మోసం చోటు చేసుకుంది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్‌లో నాలుగేళ్ల క్రితం కనకదుర్గలోన్ బ్యాంక్ స్థానిక శాఖ ఏర్పాటయింది. ఇందులో సిబ్బందిని మెయిన్ బ్రాంచ్ వాళ్ళు ఏర్పాటు చేశారు. ఈ బ్రాంచ్‌లో పనిచేస్తున్న కొంతమంది వ్యక్తులు కుమ్మక్కై నకిలీ బంగారు చూపించి దాదాపు 3 కోట్ల రూపాయల డబ్బులు లోన్లుగా తీసుకుని పరారైపోయారు. కొంతమంది వ్యక్తులు ఈ బ్యాంకులో ఉద్యోగులుగా చేరి నకిలీ గోల్డ్‌పెట్టి దాదాపు రూ.మూడు కోట్ల దండుకుంటున్నారని తెలిసింది. **మెయిన్‌లో**

# శాశ్వత మస్తాబులు : పారదర్శకతతో పనులు

### శివరాత్రి ఏర్పాట్లును పరిశీలించిన బొజ్జల, కోలా ఆనంద్



శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో వచ్చేనెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సోమవారం శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బిజెపి నాయకుడు మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్,ఇతర నాయకులతో కలసి పరిశీలించారు.సుమారు 4గంటల పాటు అడుగడుగునా ఏర్పాట్లను పరిశీలించారు.గత ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను రూ.5కోట్లుతో చేపట్టారని అందులో సగం రూ.2.5కోట్లు భోజనం చేసారని ఆరోపించారు.దేవుని సొత్తు అని కూడా లేకుండా విచ్చల విడిగా నిధులు దుర్వినియోగం చేసారన్నారు.అయితే ఈ ఏడాది శివరాత్రిని జవాబుదారి తనంతో నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**ఆలయంలోని అడుగడుగునా పరిశీలన:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గత ఏడాది ఒక రోజు పూల మస్తాబులకు రూ.72 లక్షలు వెచ్చించారని అయితే ఇందులో రూ.22లక్షలు కూడా వెచ్చించక తలా కొంచెం పంచుకున్నారన్నారు. అయితే ఈ ఏడాది రూ.90లక్షలతో శాశ్వత లైటింగ్‌ను ఏర్పాటు చేయుటకు న్యూఢిల్లీ, ముంబై నుంచి టెక్నిషియన్లను పిలిపించామన్నారు. ఎక్కడా పురాతన కట్టడాలకు భిన్నం చేయకుండా శాశ్వత లైటింగ్ చేపట్టనున్నట్లు సుధీర్‌రెడ్డి వివరించారు. ఆలయంలోపల 296,ఆలయం బయట 170 పిల్లర్లు ఉన్నాయని వాటికి క్లిప్పింగ్‌ల సహాయంతో మస్తాబులు చేస్తున్నామన్నారు.ఆలయం లోపల స్వామి అమ్మవార్ల గర్భాలయం వద్ద మస్తాబులను ఎలా చేయాలనే అంశాన్ని పరిశీలించారు. ఇక స్వామి గర్భగుడి వద్ద క్యూలైన్లను పరిశీలించారు.అలాగే ఆలయ పరిసరాల్లో పరిశీలనలు జరిపారు.

**అన్నదానం భవనాల పరిశీలన**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమలు జరుగుతున్న నిత్యాన్న ప్రసాదం అమలు పరిశీలనను ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి పరిశీలించారు. అంతేకాక భోజనం చేస్తున్న వారిని భోజనంకు సంబంధించి విచారించారు. అలాగే ఇక్కడ ఒక సారికి 300 మంది భోజనం చేసే అవకాశం ఉంది. అలాగే ఈ భవనాల మీదనే మరో షెడ్డును ఏర్పాటు చేసి ఒక సారికి కనీసం మరో 300 మంది భోజనం చేయటానికి ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. ఇక్కడ ఏర్పాట్లకు సంబంధించి కోలా ఆనంద్ గతానుభవాలను రాబోవు శివరాత్రిక చేపట్టాల్సిన ఏర్పాట్లును ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డితో చర్చించారు.ఈ పరిశీలనలో ఆయనతో పాటు మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెంచయ్యనాయుడు తదితరులున్నారు.

# కరెంట్ షాక్‌తో రైతు మృతి

### - పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుని కుమారుడు..
### - రైతు మృతిపై పలు అనుమానాలు



రొంపిచెర్ల, జనవరి27, ప్రభాత వార్త: రొంపిచెర్ల మండలం బొమ్మయ్య గారి పల్లి గ్రామ పంచాయతీలోని నగిరి హరిజనవాడకు సమీపంలో కరెంటు షాక్‌తో రైతు మృతి చెందడం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రైతు కుమార్ రాజా (62) నగిరి హరిజనవాడలో జీవనం సాగిస్తున్నారు. అయితే ఇంటికి 300 మీటర్ల దూరంలో ముళ్ళపొదల్లో ఆయన మృతి చెంది ఉండగా కుటుంబ సభ్యులు కనుకొన్నారు. అయితే శరీరం, కాళ్లపై కరెంటు షాక్ తో మృతి చెందినట్లు గుర్తులు ఉన్నాయి. శవం ఉన్న చోట దగ్గర్లో కరెంటు వైర్లు లేకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. వ్యవసాయ పొలాల్లో అడవి పందులకు తీసిన కరెంటులో పడి మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతిని కుమారుడు రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సోమవారం తెలిపారు. దీంతో విజిలెన్స్ అధికా రులు సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. బయట ఎక్కడో కరెంటుతో చంపి ఇక్కడ పడవేసి ఉండొచ్చని అందరూ భావిస్తున్నారు. రొంపిచెర్ల ఏఎస్ఐ మధుసూదన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలో నిజా నిజాలు బయటపడే అవకాశం ఉంది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సమస్యలకు సత్వర పరిష్కారం

– మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్

**చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త:**

ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని గ్రీవెన్స్ హాలులో సోమవారం కమీషనర్ నరసింహప్రసాద్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం సమస్యలపై ఆరు అర్జీలు అందాయి. ఈ అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని కమీసనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, ఎంఇ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభకు పురస్కారం

గుడిపాల, జనవరి 27 ప్రభాతవార్త:



విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన గుడిపాల తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి చిత్తూరు పోలీసు శిక్షణా మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రసంశాపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఉత్తమ పురస్కారం లభించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, ప్రజలకు అందుబాటులో వుండి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 47 ఫిర్యాదులు



***చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త:*** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి 47 సమస్యలు అందాయి. ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించి సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమలో చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా భూసమస్యలకు సంబంధించి 18 సమస్యలు అందగా చీటింగ్ 4, కుటుంబ తగాదాలు 5, వేధింపులు 7, డబ్బు తగాదాలు 7, ఆస్తి, దారి, ఇంటి తగాదాలు రెండేసీ అందాయి.

## పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా ప్రకాష్

చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త:

యామదరి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా ఎం.ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వేణు ఆధ్వర్యంలో మండల పంచాయితీ కార్యదర్శుల సంఘ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా జె.దీప, ప్రధాన కార్యదర్శిగా ఎ.కల్పన, కోశాధికారిగా ఎం.దివ్య, కార్యవర్గ సభ్యులుగా పురుషోత్తంరెడ్డి, గణేష్,వాణి, అంజుమ్, హేమశేఖర్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని ఎంపిడిఓ వేణు అభినందించారు.

## రాష్ట్రానికి చంద్రబాబతోనే బంగారు భవిష్యత్తు

– రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు



***కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త*** ఆంధ్రప్రదేశ్‌కు సిఎం చంద్రబాబునాయుడే బ్రాండ్ అని ఆయనతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సిఎం పిఏ మనోహర్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, కుప్పం కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్ తదితరులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి అంటే ఏంటో తెలియని వైకాపా నేతలు సిఎం చంద్రబాబును విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఉద్యోగాలు, పెట్టుబడులు, పేదరిక నిర్మూలన, అభివృద్ధి తమ ప్రభుత్వ అజెండా అన్నారు. సిఎం చంద్రబాబునాయుడు దావోస్ పర్యటన ఫలితాలు రాష్ట్రానికి అందుతాయన్నారు. దావోస్‌లో సిఎం బిల్‌గేట్స్, మిట్టల్ వంటి ప్రముఖులను కలిశారని వారు కూడా పెట్టుబడులకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. అధికారంలో వచ్చిన ఏడు నెలల కాలంలోనే 7లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయంటే అది సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చొరవేనన్నారు. సిఎం చంద్రబాబు గొప్పతనం తోనే రాష్ట్రానికి గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎన్‌టిపిసి ప్రాజెక్టులు వచ్చాయన్నారు.. త్వరలోనే ఎఐ, డీప్ టెక్నాలజీ సంస్థలు కూడా వస్తాయన్నారు. రాష్ట్రంలో పది పోర్టుల ఏర్పాటుకు సిఎం చర్యలు చేపట్టారన్నారు. జగన్ అసమర్థతతోనే రాష్ట్రం 12లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. మరలా రాష్ట్ర ప్రజలు జగన్‌ను నమ్మేస్థితిలో లేరన్నారు.మంత్రినారా లోకేష్ యువగళం పాదయాత్ర రెండేళ్ళ క్రిత ం మొదలై రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించిందని హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో స్టేట్ కార్పోరేషన్ డైరెక్టర్‌వేణుగోపాల్,నేతలుఆర్ముగం,ప్రతాప్,వినోద్, ఫ్లోర్‌లీడర్‌జీమ్‌దాము,మంజు,వెంకీ,నరేష్ పాల్గొన్నారు.

## జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం



వి.కోట, జనవరి 27 ప్రభాతవార్త

వి.కోటలోని జర్నలిస్టుల కాలనీ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని ఎంపిపి యువరాజ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పాత్రికేయులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జర్న లిస్టుల కాలనీలో డ్రైనేజీల నిర్మాణంకు మండల పరిషత్ తరపున నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్ అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు



రామకుప్పం, జనవరి 27 ప్రభాతవార్త

మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుకుమార్ గత వారం రోజులుగా కన్పించడం లేదని అతని భార్య యశోద సోమవారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 20వతేది నుంచి సుకుమార్ కన్పించకపోవడంతో పాటు అతని సెల్‌ఫోన్ సైతం స్విచ్చాఫ్‌లో ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటమోహన్ తెలిపారు. కాగా సుకుమార్‌ది మదనపల్లి స్వస్థలం అని తెలిసింది.

## సంచార జాతుల వారి సమస్యలు పరిష్కరించాలి

**రామకుప్పం, జనవరి 27 ప్రభాతవార్త** అత్యంతవెనుకబడిన సంచార జాతుల వారిని మండలంలో గుర్తించి సమస్యలు పరిష్కరించాలని సంఘ అధ్యక్షుడు చలపతి, సుబ్రి, నాగరాజు తదితరులు తహశీల్దార్ బాబుకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ది పొందేందుకు గాను సంచార జాతుల సర్వే చేయించాలని కోరారు. వంద యూనిట్ల ఉచిత విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవడంతో

## బిజెపిచే రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమం



***చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త*** భారత సంవిధాన్ గౌరవ దివస్ సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలోభారత రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం రచించి 75వసతాలు పూర్తయిందని నియోజకవర్గ బిజెపి కన్వీనర్ మదన్‌మోహన్,మండలాధ్యక్షుడు కడియాల మనోహర్‌లు అన్నారు. రాజ్యాంగం యొక్క విశిష్టతను అందరికీ తెలియజేసారు. బిజెపి నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, మల్లికారాణి, ప్రవీణ్‌కుమార్, శేఖర్‌బాబు, రెడ్డెప్ప, విశ్వనాథనాయుడు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## కుప్పానికి పరిశ్రమలు తెచ్చేందుకు సిఎం చంద్రబాబు కృషి

– కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



***కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త*** కుప్పం నియోజకవర్గానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చేందుకు సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సోమవారం కుప్పం మండల కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించి ప్రజలనుంచి వినతులు సీ్వకరించారు. అనంతరం అధికారులతో జరిగిన సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడారు.దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక, పెట్టుబడుల సదస్సుకు ప్రపంచంలోని నలుమూలల నుంచి ప్రతినిధులు విచ్చేశారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, ఐటి మంత్రి నారా లోకేష్‌ల నేతృత్వంలో తమ బృందం చేపట్టిన పర్యటన విజయవంతమైందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో పెట్టుబడులు పెట్టేందుకు సుమారు 20-25 సంస్థలతో చర్చించారన్నారు. కడ పరిధిలో అభివృద్ధి పనులు విజన్ 2029 ప్రణాళిక మేర చేపట్టడం జరుగుతుందన్నారు. ఇటీవలే సిఎం చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అభివృద్ధి పనులు వివరించారన్నారు. కడకు మంజూరైన నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల్లో చేపట్టిన పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కుప్పంలో చేపట్టాల్సి న మరిన్ని అభివృద్ధి పనులపై మరలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు తెలియజేయాల్సి న అవసరం ఉందన్నారు. అధికారులు స్వతహాగా తమ శాఖల్లో చేపట్టే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టిబాబు,డిఇలు గురవారెడ్డి, పురుషోత్తం, సుబ్రమణ్యం, హిమ్మత్ సాగర్, ఎంపిడిఒ సాయిలహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గుడుపల్లెలో ఈడిగ కులస్తులకు మద్యం దుకాణం కేటాయింపు

***కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త*** జిల్లా కలెక్టర్ మరియు ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు గీత కులాలకు చెందిన ఈడిగ కులస్తులకు గుడుపల్లె మండలంలో జనాభా ప్రాతిపదికన ఓ మద్యం దుకాణం కేటాయించినట్లు కుప్పం ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. దరఖాస్తులు చేయదలచుకున్న వారు గెజిట్ మేరకు కులధృవీకరణపత్రం, స్థానికత సర్టిఫికెట్లతో సహ ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో తిరిగి చెల్లించబడని 2లక్షల రూపాయలకు చలాన్ లేదా డిడి తీసి దరఖాస్తులు చేయవచ్చన్నారు. మిగతా సమాచారం కోసం కుప్పం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులకు జెఇఇ..నీట్ పరీక్షలపై అవగాహన సదస్సు



***కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త*** స్థానిక ఐఆర్ఎం డిగ్రీ కాలేజ్‌లో సోమవారం ఇంటర్ విద్యార్థులకు తిరుపతి అల్లెన్ కెరీర్ ఇన్స్టిట్యూట్ హెడ్ శ్రీఫణిచే జెఇఇ, నీట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే అంశంపై అవగాహన సదస్సును కాలేజ్ ఛైర్మన్ బిఎం దయానిధి అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. కుప్పంలో ఎస్వీ గ్రూప్ వారి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్యాంపస్‌లో 5-10తరగతుల విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకు కాట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ అవకాశాన్ని కుప్పం పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు స్కూల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జోనల్ స్థాయి ప్రాజెక్టుల పోటీల్లో కెఇసి విద్యార్థులకు బహుమతులు



***కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త*** కుప్పం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, శాంసంగ్ వారు సంయుక్తంగా జోనల్ స్థాయిలో నిర్వహించిన అన్వేషణ 2025 ప్రాజెక్టుల తయారీ పోటీల్లో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు నగదు బహుమతులు సాధించినట్లు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్‌రాజ్ తెలిపారు. ఎఐ,మెషిన్ లెర్నింగ్ విభాగంలో డా॥ లోకేష్ అధ్వర్యంలో పావన, శోభ రూపొందించిన వేస్ట్ వర్త్ ప్రాజెక్టుకు రెండో బహుమతిగా 12వేలు సాధించారన్నారు. అలాగే అబ్దుల్ తౌహిద్,అరుణ్‌కుమార్‌ల ప్రాజెక్టు బ్లేడ్ టెక్ ఇన్నోవేషన్ ఐదో బహుమతి, అరవింద్, ఆకాష్‌ల స్మార్ట్ రివార్డ్ ప్రాజెక్టు, మేఘన, తనూజల ఎకోస్పియర్ ప్రాజెక్టులకు బహుమతులు లభించాయన్నారు. వీరు హైదరాబాద్‌లో జరగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను సిఇఒ సాగర్ రాజ్, ప్రిన్సిపాల డా॥ సుధాకర్‌బాబు తదితరులు అభినందించారు.

## ఈడిగ కులస్తులచే సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



***కుప్పంరూరల్, జనవరి 27 ప్రభాతవార్త*** రాష్ట్రంలో ఉన్న గీత కులాలను గుర్తించి వారి అభ్యున్నతికి సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తుండడం పట్ల ఈడిగ కులస్తులు సోమవారం కుప్పంలో సిఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు ఇఎం సుధాకర్, నేతలు నారాయణ గౌడ్ మాట్లాడుతూ ఈడిగ కులస్తులను గుర్తించింది తెదేపాయేనన్నారు. సిఎం చంద్రబాబు చొరవతో చిత్తూరు జిల్లాలో పది మద్యం దుకాణాలు గీత కులాలకు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగేంద్ర ప్రసాద్, వెంకటేష్, త్యాగరాజు, హరినాథ్ గౌడ్, శివశంకర్, మురళి, లోకనాథం పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలకు దరఖాస్తులు

చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త:

సొంత ఇంటి స్థలం కలిగివుండి ప్రభుత్వ సబ్సిడీతో సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి అర్హులైన లబ్దిదారులు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు. ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం కింద సొంత ఇంటి స్థలం కలిగి వుండి ప్రభుత్వం మంజూరు చేసే సబ్సిడీ ద్వారా ఇల్లు నిర్మించుకోవచ్చునన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఎపి హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 2.5 లక్షల రూపాయలు మంజూరు చేస్తోందన్నారు.

## చెరువు కట్టను పరిశీలించిన చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, జనవరి 27, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం 106 ఇరామిరెడ్డి గారిపల్లి పంచాయతీ నందు నాయిని చెరువు కట్టను సోమవారం పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు కట్ట ప్రమాదానికి గురికావడంతో గ్రామస్తులు ఈ విషయాన్ని చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో చల్లా రామచంద్రారెడ్డి, నాయిని చెరువు కట్ట వద్దకు వెళ్లి కట్టను పరిశీలించి కలెక్టర్ సుమిత్ కుమార్ , జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి వెంటనే చెరువు కట్ట మరమ్మత్తులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో 10వ తరగతి విద్యార్థులకు

ఎగ్జామ్ ఫ్యాడ్స్ పెన్‌లు పంపిణి



యర్రావారిపాలెం, జనవరి 27, ప్రభాతవార్త

యర్రావారిపాలెం మండలంలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలకు 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాయడానికి ఎగ్జామ్ ఫ్యాడ్‌లు, పెన్నులు పంపిణి చేయడం జరిగింది. ఎమ్మెల్యే పులివర్తినాని పిల్లల భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచిస్తారని నాయకులు తెలిపారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పిల్లలను పరీక్షలకు మోటివేషన్ చేయడానికి తమటీమ్‌తో ఫ్యాడ్‌లు, పెన్నులు పంపిణి చేయడం చాలా ఆనందించాల్సి న విషయం అని అన్నారు. యర్రావారిపాలెం యూనిట్ ఇంచార్జ్ బాలు మాట్లాడుతూ మండలంలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురకు బహుమతులు ఎమ్మెల్యే చేతులు మీదగా అందిస్తామని తెలిపారు. మొదటి బహుమతిగా 10000 రూపాయలు, రెండవ బహుమతిగా 7000 రూపాయలు, మూడవ బహుమతిగా 5000 రూపాయలు ఇస్తామని మండలంలో మోడల్ స్కూల్, కస్తూరిబా స్కూల్, యర్రావారిపాలెం హై స్కూల్, పచ్చారువాండ్లపల్లె, నెరబైలు, ఉదయమాణిక్యం పాఠశాలలకు పంపిణి చేయడం జరిగింది. మిగిలిన పాఠశాలలకు రేపు పంపిణి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ చిన్నపరెడ్డి, యువనాయకులు బానుప్రకాష్ రెడ్డి నియోజకవర్గ యూత్ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, యువనాయకులు గోపి,సిరివెలురమేష్, మోడల్ స్కూల్ చైర్మన్ ఉదయ్, జైపాల్ రెడ్డి, విజయారెడ్డి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## నాగబాబు పర్యటనను విజయవంతం చేయండి

జనసేన మండల కన్వీనర్ సూరిశెట్టి నాగభూషణం

సోమల, జనవరి 27, ప్రభాతవార్త



జనసేన పార్టీ నాయకులు కొణిదెల నాగబాబు ఫిబ్రవరి 2న సోమల మండల పర్యటన జయప్రదం చేయాలని మండల కన్వీనర్ నాగభూషణం కోరారు. మేజర్ పంచాయతీ అయిన కందూరులో జనసేన కార్యకర్తలతో సమావేశమై కార్యక్రమం జయప్రదం పై సమాలోచనలు చేశారు.జనసేన నాయకులు డాక్టర్ హరి నారాయణ, బండారు రఘు, గోపి, విజయ్, చంద్ర, పవన్, ప్రభు, మునీర్ పాల్గొన్నారు.

## 108లోనే ప్రసవించిన మహిళ



-తల్లీబిడ్డలు సురక్షితం

చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త

కుయ్ కుయ్‌లోనే ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. 108 సిబ్బంది కథనం మేరకు…మండలంలోని 29ఎ.చింత మాకుపల్లి పంచాయతీ పిఎల్ కొత్తూరుకు చెందిన శోభారాణికి పురిటినొప్పులు వచ్చాయి. దీంతో ఆమె భర్త గంగాధరం 108కు ఫోన్ చేసి సమాచామిచ్చాడు. వెంటనే స్పందించిన సిబ్బంది గణేష్, చిట్టిబాబులు గ్రామానికి చేరుకొన్నారు. గర్భవతి శోభారాణిని వాహనంలో తరలిస్తుండగా మార్గ మద్యలో నొప్పులు అధికం కావడంతో గణేష్ అప్రమత్తమై అక్కడే ఆమెకు పురుడు పోశాడు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తల్లీబిడ్డలను సకాలంలో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఇద్దరూ ఆరోగ్యవంతంగా వున్నట్లు సిబ్బంది తెలిపారు.

## వడ్డెర సంఘ మండలాధ్యక్షుడుగా వెంకట్రమణ

చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త

వడ్డెర సంఘ మండలాధ్యక్షుడుగా గడ్డంవారిపల్లి మాజీ సర్పంచు, ఎంపీటీసీ సభ్యుడు జి.వెకంట్రమణను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నియోజకవర్గం కేంద్రం పుంగనూరులో సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఏకగ్రీవ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడుగా జయకుమార్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డెప్ప, కార్యదర్శిగా దాము, కోశాధికారిగా కాటమన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని ఈ సందర్భంగా వెంకట్రమణ తెలిపారు.

## అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త



నిత్యం విద్యార్థుల విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ వారిని సన్మార్గంలో నడుపుతున్న స్థానిక ఎస్సీ వసతిగృహం వార్డన్ సురేష్‌కు గణతంత్ర వేడుకల్లో ఉత్తమ వార్డన్‌గా అవార్డు వచ్చింది. ఈ సందర్భాన్ని పురష్కరించుకొని ఉన్నతపాఠశాల ఆవరణంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. వసతిగృహ అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులుమురళి, ఈశ్వర్, సుధాకర్, సుధాకర్, పరిమళ, సుమిత్ర, మునిరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నకొండామర్రిలో ఉచిత పశువైద్య శిబిరం

పెద్దకొండామర్రి(చౌడేపల్లి), జనవరి 27 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రిలో శుక్రవారం ఉచిత పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. మేకలు, గొర్రెలకు 2వ విడత నట్టల నివారణ మందులు పంపిణీ చేసారు. వీటితో పాటు పశువులకు సోకే గర్భకోశ వ్యాధులు, చూడి నిర్ధారణా పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. పశువుల్లో సోకే పలు వ్యాధులపట్ల రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, సిబ్బంది రెడ్డిప్రసాద్, గోవర్ధన్, నందుకుమార్, పాడి రైతులు పాల్గొన్నారు.

## 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా దావోస్ పర్యటన

74 ఏళ్ళ వయస్సులో చంద్రబాబు 2047 విజన్, ఎంఎల్ఏ పులివర్తి నాని



***చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త:*** రాష్ట్రంలో యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటన విజయవంతమైనట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 74 ఏళ్ళ వయస్సులో 2047 విజన్ వైపు దూసుకుపోతున్న ముఖ్యమంత్రికి ప్రపంచ వ్యాప్తంగా గల ఆధరణను కొనియాడారు. భవిష్యత్తు ఆర్టఫిషియల్ ఇంటిలిజెన్స్‌దేనని గ్రహించిన ముఖ్యమంత్రి ఆ మేరకు ఏఐ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆర్సెలార్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్ కంపెనీతో రూ.1.46 కోట్లు పెట్టుబడితో పాటు వివిధ కంపెనీలతో లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకువచ్చినట్లు తెలిపారు. పసలేని ఆరోపణలతో కాలం వెళ్ళబుచ్చుతున్న వైసిపి నాయకులు తమ పాలనలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదలివెళ్ళిపోయిన విషయాన్ని గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రతో అద్భుతమైన ఫలితాలను సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, వీరంగారి రమేష్ రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

## సభ్యసమాజం అసహ్యపడే దుర్మార్గపు చర్య

***చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త:*** దుర్మార్గపు చర్యను సభ్యసమాజం అసహ్యపడే విధంగా చంద్రగిరి పొలిమేరలోని ఓ గ్రామంలో సొంత చెల్లిపై అన్న అత్యాచారానికి పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదు చేసినట్లు సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా అన్న తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నప్పటికీ భయంతో సహించిన చెల్లెలు ఎట్టకేలకు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్ళింది. నానాటికీ దిగజారిపోయి రాక్షసత్వంతో అన్న తనపై అఘాయిత్యానికి పాల్పడున్నట్లు చెప్పడంతో తల్లిదండ్రులు నివ్వెరపోయారు. నిందితుడి దుర్మార్గాన్ని తల్లిదండ్రులతో కలసి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు.

## ఉత్తమ సేవలకు ప్రభుత్వ ప్రశంసలు



***చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త:*** శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ఏఈఓగా భక్తులకు విశిష్ట సేవలందించిన ఎం.గోపినాథ్‌కు రిపబ్లిక్ వేడుకలలో ఈఓ జె.శ్యామల రావు, అధనపు ఈఓ వెంకయ్య చౌదరి చేతులమీదుగా ప్రశంసాపత్రంతో అభినందనలు అందుకున్నారు. అదేవిధంగా కందులవారిపల్లి విఆర్ఓ నిశాంత్ ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు పర్యాయాలు వచ్చిన నేపథ్యంలో ఆయన చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం గణతంత్ర వేడుకలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందజేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా జాతీయ ఉపాధిహామీ పథకం, ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.కొత్తపల్లికి చెందిన ఏ.టి.రాజేంద్ర సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందజేసి అభినందలు తెలిపారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బిజెపి మండల అధ్యక్షుడు రాజులగారి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాలి పుష్పలత మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించడం జరిగిందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా సంవిధాన్ పేరిట కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని, జిల్లా కార్యదర్శి కాయం హరినాథ్ రెడ్డి, నాయకులు సుబ్రమణ్యం యాదవ్, మునిగంగిరెడ్డి, దొరస్వామి, నరేష్‌కుమార్ నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, మోహన్ రాజులు, నవీన్‌కుమార్ రెడ్డి, టివి ప్రసాద్, మునెయ్య, చందేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ వేలం

సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి

చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామ పంచాయతీకి చెందిన టవర్ క్లాక్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్ గదులకు ఈ నెల 31న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గది నంబర్ 1 నుండి 13 వరకు అద్దె ప్రాతిపదికన 2025 ఫిబ్రవరి 1 నుండి 2027 సెప్టెంబర్ 30 వరకు 2 సంవత్సరాల 7 నెలల కాలానికి గుత్తహక్కును బహిరంగ వేలం ద్వారా కేటాయించుటకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు పంచాయతీ కార్యాలయంలో జరిగే వేలంకు ముందుగా డిపాజిట్ చెల్లించాలని అన్నారు. మరిన్ని వివరాలకు పనివేళల్లో పంచాయతీ ఈఓను సంప్రదించాలని కోరారు.

## శివయ్య సన్నిధిలో కుడా ఛైర్మన్

శ్రీకాళహస్తి, జనవరి 27 ప్రభాతవార్త

స్థానిక ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సూచనల మేరకు శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం తెలుగు దేశంపార్టీ సీనియర్ నాయకులు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్(కుడ) సోమిశెట్టివెం కటేశ్వర్లు విచ్చేశారు. ఆయనకు మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ వాకచర్ల గురప్పశెట్టి, కొండా సతీష్‌కుమార్ మరియు వజ్రం కిషోర్‌లు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఆర్యవైశ్యులు ఎం.సుబ్బారావు, జె.మోహన్‌బాబు, గోపి, గోపికృష్ణ టెక్స్‌టైల్స్ అధినేత ప్రసాద్, జి.గురవయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## బాలుకు విశిష్ట ప్రశంసాపత్రం

.తొట్టంబేడు, జనవరి 27 ప్రభాతవార్త

మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయులు కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరుబాలసుబ్రమణ్యం అంతర్జాల వేదికగా విశిష్ట అభినందన ప్రశంసాపత్రం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదరణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన స్వేచ్ఛా స్వాతంత్ర్యం అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో చక్కటి దేశభక్తి కవితను పంపినందుకు అభినందనలు తెలుపుతూ విశిష్ట ప్రశంసాపత్రం అందించినట్లు ఆదరణ సంస్థ ఫౌండర్ గొట్టుముక్కల చెన్నకేశవుల తెలిపారు. ఈ ప్రశంసాపత్రం రావడం పట్ల పలువురు బాలుని అభినందించారు.

# గూడూరు డివిజన్

## క్రీడలతో శారీరక దృఢత్వం : డిఎస్పీ



గూడూరు, జనవరి 27 ప్రభాతవార్త : క్రీడలలో రాణించడం ద్వారా శారీరక దృఢత్వం పెంపొందించుకోవడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవచ్చని గూడూరు డిఎస్పీ గీతా తెలిపారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ గూడూరు డిఎస్పి గీత ప్రారంభించారు. క్రీడలు, వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థినిలను గూడూరు డిఎస్పి గీత అభినందిస్తూ పురస్కారాలు అందజేశారు. సమావేశంలో గూడూరు డిఎస్పి గీత మాట్లాడుతూ అనేక క్రీడలలో మహిళలు రాణించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారని వివరించారు.

## విద్యార్థులకు వసతులు కల్పించేందుకు కృషి చేస్తా

డక్కిలి,జనవరి 27ప్రభాతవార్త : మిట్ట వడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ సహకారంతో కృషి చేస్తానని ఆగ్రామ టీడీపీ నాయకుడు తిరుపతి పెంచలయ్య తెలిపారు. గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను విద్యలో ప్రోత్స హించాలని వారికి ప్రోత్స హక బహుమతులు ఇస్తున్నట్లు వివరించారు. ఇక మిట్ట వడ్డిపల్లి గ్రామంలో అన్నీ వీధులను సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.ఇటీవల రూ.5లక్షలతో సిమెంట్ రోడ్డు వేశామన్నారు.

## నారాయణలో డ్రోన్ టెక్నాలజీపై అవగాహన



గూడూరు, జనవరి 27 ప్రభాతవార్త : నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో డ్రోన్ టెక్నాలజీపై అవగాహన శిబిరం సోమవారం నిర్వహించారు. నారాయణ ఇంజనీరింగ్ కాలేజ్ గూడూరు కళాశాల విద్యార్థులు ఆధునిక టెక్నాలజీ విద్యను నేర్చుకోవడానికి ముందడుగు వేశారు. భవిష్యత్తులో ప్రపంచం లోనే నంబర్ వన్ టెక్నాలజీగా మారబోయే డ్రోన్ టెక్నాలజీ వర్క్ షాపుకు వంద మంది మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ విభాగాలు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ యశ్వంత్, ఏవిఎస్ శ్రీధర్‌లు మాట్లాడుతూ డ్రోన్‌లను తయారు చేయించి విద్యార్థులతో ఎగురవేసి చూపించడమే ఈ వర్క్ షాప్ ముఖ్య ఉద్దేశమన్నారు.

## ఆదిశంకరలో మూడు రోజుల సదస్సు ప్రారంభం



గూడూరు, జనవరి 27 ప్రభాతవార్త : ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో స్టాటప్స్ అండ్ ఇండస్ట్రీ రెడీ స్కిల్స్ మూడు రోజుల సదస్సు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. ఇమ్మానుయేలు, సిఈఓ, ఎసిఐసి-ఏసిఐఐసి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత మైన పారిశ్రామికవేత్తలుగా, ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడానికి ఈ సదస్సు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సదస్సును ముఖ్య అతిధిగా శిక్షకులుగా విచ్చేసి పవన్ కుమార్ మాట్లాడుతూ పలు రకాల ఉదాహరణలతో చక్కగా వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.దనుంజయ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా విద్యార్థిని విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు అధిరోహించాలని అవసరమైన విద్యార్థులు ఉన్నత నైపుణ్యాలను నిర్మించుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ సదస్సు నిర్వహిస్తున్న కోఆర్డినేటర్, కన్వీనర్ ప్రణయ్ కుమార్‌ను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుమాదవ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్‌కె. ధనంజయ, డీన్ అకడమిక్ డాక్టర్ ఎం. రాజయ్య, ఎసిఐసి డాక్టర్ ఎ. ఇమ్మానుయేలు, ఐఐస కన్వీనర్ ప్రొఫెసర్ ప్రణయ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, కళాశాల ఎటిజె రామయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే అవార్డు అందుకున్నా

**- తహశీల్దార్ కె.జయజయరావు**



కోట, జనవరి 27 ప్రభాతవార్త : 2024 ఎన్నికల అనంతరం కోట మండలానికి వచ్చిన తహశీల్దార్ కె.జయజయరావు రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉన్నారు. చిట్టేడు గ్రామంలో ఎన్నో సంవత్సరాల నుంచి పరిష్కారం కాని స్మశాన స్థలం విషయంలో తహశీల్దార్ జయజయరావు చాకచక్యంగా ఆ సమస్యను పరిష్కరించారు. 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లో భారీ వర్షాల కారనంగా కోట మండలంలో ముందస్తు చర్యలు చేపట్టి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని ఎక్కడా నష్టం ఏర్పడకుండా చూశారు. ఫ్రీహోల్డ్ సమస్యలను పరిష్కరించారు. రెవెన్యూ సదస్సులను విజయవంతం చేశారు. ఈ నేపథ్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఆయనకు జిల్లాస్థాయి ఉత్తమ అధికారిగా అవార్డు ప్రదానం చేసింది. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తమ శాఖలోని ఉద్యోగుల సహకారం వలన ఈ పురస్కారం అందుకున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో జిల్లా స్థాయి అధికారులకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకు అతీతంగా మండలంలోని నాయకులు ఆయన్ను అభినందించారు.

## పార్టీ అధికారంలోకి రావడం లోకేష్‌తోనే : శీలం



గూడూరు, జనవరి 27 ప్రభాతవార్త : యువగళం కార్యక్రమం ద్వారా 226 రోజులపాటు 4,000 కిలోమీటర్లు 97 నియోజకవర్గాల మీదుగా పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని నేడు రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తు న్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ తెలిపారు. మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర రాష్ట్ర పరిధిలో 97 నియోజకవర్గాల్లో నిర్వహించగా వాటిలో 90 నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిందని తెలిపారు. గూడూరు నియోజవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు తరపున ఆయనకు అభినందనలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, గూడూరు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రాజు, జిల్లా అధికార ప్రతినిధి చెంచురామయ్య, టిడిపి ముఖ్య నాయకులు శివకుమార్, రహీం, ఇజ్రాయిల్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన తహశీల్దారుకు ప్రసంసా అవార్డు



డక్కిలి, జనవరి27ప్రభాతవార్త : డక్కిలి మండల తహశీల్దారు ఎం.శ్రీనివాసులు విధి నిర్వహణలో చేసిన సేవలను గుర్తించి ఉత్తమ సేవా ప్రసంసా అవార్డు గూడూరు సబ్‌కలెక్టరు రాఘవేంద్రమీనా అందజేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ పి.ప్రియాంక,ఆల్తూరుపాడు వీఆర్వో పి.నరేష్, సచివాలయం సర్వేయరు టి.సురేష్‌లను ఎంపిక చేశారు.

## గురుకులంలో రెండు రోజులు సామాజిక తనిఖీ

డక్కిలి,జనవరి 27 ప్రభాతవార్త : డక్కిలి గరుకులం ఉన్నత పాఠశాల,కళాశాలలో ఈనెల నెల 25,27 తేదిలలో సామాజిక తనిఖీ బృందం క్షుణంగా పలు అంశాలపై తనిఖీ నిర్వహించింది.తనిఖీ బృందంలో కే.చెంచయ్య, ఎం.శంకర్ ఉన్నారు.రాష్ట్రవ్యాప్తంగా జరగుతున్న తనిఖీలో భాగంగా వారు తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అన్నీ వసతులు, వాతావరణం ఎలా ఉంది, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అనే పలు అంశాలపై ఈ బృందం సిబ్బంది విచారణతో పాటు తనిఖీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో గురుకులం ఉన్నతపాఠశాల,కళాశాల తల్లిదండ్రుల కమిటీ చేర్మన్ సర్వేపల్లి రత్నయ్య,కళాశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించండి



సూళ్లూరుపేట, జనవరి 27 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏరియాలో ఉన్న రహదారుల్లో బస్సులను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడం, బండ్లను రోడ్లపై ఉంచుకోవ డంతో పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. రైల్వేగేటు, హోలీక్రాస్ జంక్షన్, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఉన్నప్పటికీ నియంత్రణ లేదని వారు తెలిపారు. ఈ విషయమై సిఐ మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కృపమ్మ, సుబ్రహ్మణ్యంరెడ్డి, శంకరయ్య, పాపయ్య, రామారావు, సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి ఆరు నెలల్లో... నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు

**-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కేవలం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ ఆరు నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు పలు కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చాయని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. గత అయిదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. దాంతో గత అయిదేళ్ళ వైసిపి పాలనలో రాష్ట్రంలో పెట్టుబడి పెడితే వ్యాపారం చేసుకోలేమని పారిశ్రామిక వేత్తలు భయపడి ముందుకు రాలేదని తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం ఆరు నెలల సమయంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టు బడులకు అనుకూలమని సంకేతం వెళ్లిందన్నారు. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి బడా పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఆ మేరకు విశాఖపట్నంలో టిసిఎస్ యాజమాన్యం 10,000 ఉద్యోగాల కల్పించే విధంగా పరిశ్రమ నెలకొల్పుతామని ప్రకటించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపైన, చంద్రబాబు నాయుడు, లోకేష్‌బాబు నాయకత్వంపై వున్న నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నాం న్నారు. చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన వల్ల ప్రయోజనం లేదని వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యేలంతా ఆరోపిస్తున్నారని దానికి కారణం కూడా వైసిపి ప్రభుత్వమేనని తెలిపారు. రాష్ట్రానికి వైసిపి వల్ల జరిగిన నష్టం పూడ్చలేనిదని తెలిపారు. కేవలం నెలకు అయిదు వేల రూపాయల వాలంటీరు ఉద్యోగాలిచ్చి... ఉద్యోగాలు కల్పించామని ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. అయిదు వేల రూపాయలు జీతం ఇచ్చే ఉద్యోగం ఒక ఉద్యోగమా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి లోకేష్ కృషి వల్లే రాష్ట్రానికి 4 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. తమ హోదాలు మరిచి చంద్రబాబు, లోకేష్‌బాబు పారిశ్రా మికవేత్తల వద్దకు వెళ్లి రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నారని తెలిపారు. సమావేశంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, టిడిపి పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, నాయకులు డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), డి.ఎస్.గణేష్, ప్రతాప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## వాకాడు ట్రాన్స్కో ఏఈగా విజయలక్ష్మి



వాకాడు, జనవరి 27 ప్రభాతవార్త : వాకాడు మండల ట్రాన్స్కో ఏఈగా విజయలక్ష్మి సోమవారం కొత్తగా బాధ్యతలు చేపట్టారు. ట్రాన్స్కో ఏఈగా వచ్చిన విజయలక్ష్మి వాకాడు విద్యుత్ కార్యాలయంలోని సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదోన్నతి పై బాధ్యతలు చేపట్టడం జరిగింది. నూతనంగా ఏఈగా బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ఎప్పటికప్పుడు పరివేక్షణలో ఉంటు రైతులుకు, ఆక్వా రైతులుకు ప్రజలు విద్యుత్ అంతరాయం కలగకుండా చూసుకుంటానన్నారు. ఏడి చిన్నయ్య, ట్రాన్స్కో సిబ్బంది, స్థానిక నేతలు ఆమెకు అభినందనలు తెలిపారు.

## వార్డులో వీధి దీపాలు వెలిగించాలి



వెంకటగిరి, జనవరి 27 ప్రభాతవార్త : 14వ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదని, చెడిన తాగునీటి బోళ్లను మరమ్మతులు చేయించాలన్ది కౌన్సిలర్ ఆది శంకరయ్య తెలిపారు. 8వ సచివాలయం సుదర్శన్ నగర్ నందు ప్రజా విజ్ఞప్తుల రోజు జరగడం జరిగింది. గత సంవత్సరం జాతర నుంచి ఈ సంవత్సరం సంక్రాంతి పండగ వరకు 7 లక్షల రూపాయలకు వీధి దీపాల మరమ్మతులకు సంబంధించి విడి పరికరాలు కొనుగోలు చేసి ఉన్నట్లు తెలిపారు. కానీ 25 వార్డుల్లో ఎక్కడ మరమ్మతులు చేశారు అని స్థానిక మున్సిపల్ సిబ్బంది గానీ మరియు మున్సిపల్ కమిషనర్ గాని తెలియజేయాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదాన కార్యక్రమం



గూడూరు, జనవరి 27 ప్రభాతవార్త : లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి టౌన్ క్లబ్ సేవ కార్యక్రమంలో భాగంగా గోరంట్ల, సుజిత పుట్టినరోజు సందర్భంగా గూడూరులోని సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ నందు వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో వృదులుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజిపి క్లబ్ ప్రెసిడెంట్ లయన్, పివి మనోజ్ కుమార్, గూడూరు టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్, సుబ్రమణ్యం యాదవ్, సెక్రటరీ లయన్ ఎం. శ్రీనివాస్ యాదవ్, క్లబ్ సభ్యులు ఫాస్ట్ రీజియన్ చైర్మన్ ఎంజేఎఫ్ లయన్, ఆర్‌వి రావు, పాస్ట్ జోన్ చైర్మన్ వై.లయన్ గురునాథం,ఇమ్మీడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఎస్ఎల్ఎన్ స్వామి,పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఆర్. రవీంద్రరెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు కళ్యాణి పాల్గొని కార్యక్రమంని విజయవంతం చేసారు.

## రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఫల సరుకుల పంపిణీ



ఓజిలి, జనవరి 27 ప్రభాతవార్త : గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో గుణ్ణం సేవా ట్రస్ట్ భరోసా పథకం కింద 25 మంది నిరుపేదలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. సంఘ వ్యవస్థాపక ఉపాధ్యక్షులు బుస్సా రెడ్డి దశరధ రామిరెడ్డి మాట్లాడుతూ ఓజిలి మండలం బట్ల కనుపూరు గ్రామానికి చెందిన గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతినెలా అందించటం అభినందనీయమని అన్నారు. సనత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి నెల అందిస్తున్నటువంటి గున్నంరెడ్డి మధుసూదన్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండి శ్రీనివాసులరెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, పల్లమాల హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నాగవల్లిని సత్కరించిన మున్సిపల్ సిబ్బంది



గూడూరు, జనవరి 27 ప్రభాతవార్త : మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న బొల్లవరం నాగవల్లి అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందింది. పదోన్నతి పొందిన నాగవల్లిని గూడూరు మున్సిపాలిటీ నుండి రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించి. పదోన్నతి పొందిన బొల్లవరం నాగవల్లిని గూడూరు మున్సిపల్ కమీషనర్ అన్నవరం వెంకటేశ్వర్లు, సిబ్బంది ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సర్వేయర్ రామకృష్ణ, టిపిబిఓ శ్రీను, రామన్, టౌన్ ప్లానింగ్ క్లర్క్ దీనరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి!

**-భవన నిర్మాణదారుల బెదిరింపులు**



తొట్టంబేడు, జనవరి 27 ప్రభాతవార్త : రోడ్డుమీదకు వచ్చి దర్జాగా నిర్మాణం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏకంగా కరెంటు స్తంభాన్ని కూలి కలిపేసుకుని పనులు చేస్తున్నా రెవెన్యూ అధికారులకు కనీసం చీమకుట్టినట్లు కూడా లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవన నిర్మాణానికి ఇచ్చిన ప్లాన్ ప్రకారం కట్టడాలు చేపట్టాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా భవన యజమానులు వ్యవహరిస్తున్నారు. రోడ్డు మీదకు వచ్చి నిర్మాణాలు చేపట్టడం, రోడ్డును కూడా కలిపేసుకోవడం వంటివి చేస్తున్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. భవననిర్మాణాలు చేస్తున్న వారు ఇతరులకు ఇబ్బందులు లేకుండా పట్టలు కట్టుకుని పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. అయితే ఈభవన నిర్మాణదారుడు ఎలాంటి పట్టలు లేకుండా నిర్మాణాలు చేస్తుండడంతో ఈమార్గంలో వెళ్ళే వారిపై సిమెంటు పడుతోంది. అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ పేర్కొనడం విశేషం. భవ నాలు రోడ్డుమీదకు వచ్చేస్తుండడంతో రహదారులు ఇరుకుగా మారిపోవడమే కాకుండా కనీసం రాకపోక లకు ఇరుకుగా మారింది. బంగారమ్మ కాలనీకి ఎదురుగా ఉన్న కాలనీ మొత్తం తొట్టంబేడు మండల పరిధిలో ఉంది. పట్టణానికి దగ్గరగా ఉండడంతో ఇక్కడ స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. స్థలాలు కొన్న ఎక్కువ మంది ఇటీవల నిర్మాణాలు చేపడుతున్నారు.ఈ ప్రాంతంలో ఐదో వీధిలో ఇటీవల ఒకరు మూడంతస్తుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. పైగా కరెంటు స్థంభాన్ని కూడా ఈస్థలంలో కలిపేసుకుని దర్జాగా నిర్మాణం సాగిస్తున్నారు. స్థానికులు అధికారులకు పిర్యాదు చేసినా తన పలుకు బడిపై పనులను చకచకా చేసేస్తున్నారు. ఇలా రోజు కొకరు రోడ్డుమీదకు వచ్చి దర్జాగా నిర్మాణాలు చేపడుతుంటే భవిష్యత్తులో రోడ్డుకూడా ఉండదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండలాధికారులు నిద్రమేల్కొని నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బంగారమ్మ కాలనీ వాసులు కోరుతున్నారు.

## ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్లో లక్ష్మికి ద్వితీయ స్థానం



గూడూరు, జనవరి 27 ప్రభాతవార్త : ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐట) ఉమెన్స్ 2.5 లక్షల టోర్నమెంట్ కొచ్చిలో ఈనెల 20 తేదీ నుండి 25వ తేదీ వరకు జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన దండు లక్ష్మిసిరి టోర్నమెంట్లో రన్నర్‌గా నిలిచింది. ఈ నెల 20వ తేదీ సోమవారం మొదటి రౌండ్ దాసరి శ్రీ తన్వి కర్ణాటక మీద 75 60 గెలిచింది. అదేవిధంగా మంగళవారం రెండవ రౌండ్ విధుల అమర్ కర్ణాటకపై 6262పై వరుస సెట్లలో విజయం సాధించింది. దీంతో ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఉమెన్స్ 2.5 లాక్స్ టోర్నమెంట్లో గూడూరు చెందిన దండు లక్ష్మిసిరి రన్నర్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈమె ఆల్ ఇండియా ఉమెన్స్ క్యాటగిరిలో 30, జూనియర్ అండర్ 18 లో ఇండియా నెంబర్ 4 ర్యాంకులో కొనసాగుతుంది.డెహ్రాడూన్ లో ఫిబ్రవరి 5 నుండి 11 వరకు జరిగే నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున టెన్నిస్ క్రీడా తరపున ఆడనుంది.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, జనవరి 27 ప్రభాతవార్త : వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ టేబుల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కోంటున్న పలు సమస్యలను అసోసియేషన్ నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. అసోసియేషన్ అమరావతి జేఏసీ తిరుపతి జిల్లా అధ్యక్షులు గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి సత్యానారాయణ, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా, కార్యదర్శి హేమంత్ కుమార్, కోశాధికారి జయశంకర్ వైస్ ప్రెసిడెంట్ అంకయ్య, దేవ శివకుమార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట విద్యుత్‌శాఖ ఏఇగా మోహిని



సూళ్లూరుపేట, జనవరి 27 ప్రభాతవార్త : సూళ్లూరుపేట టౌన్ విద్యుత్ శాఖ ఏఇగా ఆర్.మోహిని సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాపానాయుడుపేటలో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై సూళ్లూరుపేటకు వచ్చారు. నూతన ఏఇగా బాధ్యతలు చేపట్టిన ఆర్.మోహినిని సిబ్బంది అభినందించారు. గత ఐదేళ్లుగా ఇన్‌ఛార్జిలకే పరిమితమైన విద్యుత్ శాఖ ఏఇ పోస్టు భర్తీ కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అతుకులు కూడా అరకొరేనా...?

**ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం**

సత్యవేడు, జనవరి 27 ప్రభాతవార్త: దెబ్బతిన్న రోడ్లకు ఎట్టకేలకు అధికారులు అటుకులు వేస్తున్నారు. అయితే ఈ పనులు కూడా సక్రమంగా సాగడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సత్యవేడుకు ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈ పోస్టు ఇన్‌చార్జితో నడుస్తోంది. ఈ కారణంగా ఈ నిర్మాణ పనులకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చే దిక్కు లేని పరిస్థితి ఏర్పడింది.
సత్యవేడు-ఊత్తుకోట రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు(రోడ్డు మీద ఏర్పడ్డ గుంతలను తారు వేసి కంకరతో కలిపి పూడ్చడం జరుగుతంది) చేస్తున్నారు. పుదుకుప్పం, పేరడం, ఆంబాకం మలుపు, మదనంబేడు, దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో అక్కడక్కడ పెద్ద పెద్ద గుంతలు, రోడ్ల మధ్యలో గోతులు తవ్వినట్లు రోడ్ల అధ్వానంగా ఉన్నాయి. వాటి మీద ప్యాచ్ వర్క్‌లు చేయలేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదో తాత్కాలికంగా పూడ్చాం... అనే విధంగా ఈ పనులు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేవుడు వరమిచ్చినా... పూజారి కనికరించలేదు అనే విధంగా ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు పూర్తి స్థాయిలో చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికి ఇక్కడి అధికారులు, కాంట్రాక్టర్లు నామమాత్రంగాపనులు చేయడం పట్ల ప్రభుత్వం పై విమర్శలు ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి ప్రయాణి కులకు, వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఆ మేరకు ఆర్‌అండ్‌బీ శ్ఖాఖ ఉన్నతాధికారులు ఈ ప్యాచ్ పార్క్ పనులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, మండల వాసులు కోరుతున్నారు.

## బాధ్యతతో సమస్యలు పరిష్కారం : జాయింట్ కలెక్టర్

చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీలను బాధ్యతతో వ్యవహరించి సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఎఓ కులశేఖర్‌లు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. (ఈ వారం జిల్లా నలుమూలల నుండి సమస్యలపై అధికారులకు 331 అర్జీలు అందాయి.

## విజయనగర్ కాలనీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ



చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త: విజయనగర్ కాలనీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థకు ఎంఎల్ఏ పులివర్తి నాని ప్రజల కరతాళధ్వనుల నడుమ శంకుస్థాపన గావించారు. విజయనగర్ కాలనీలో సోమవారం టిడిపి చంద్రగిరి కార్యదర్శి రవితేజ యాదవ్, కాలనీ నాయకులు నరేంద్ర, బాలయ్య ఆధ్వర్యంలో ఎంఎల్ఏ పులివర్తి నానికి ఘన సన్మానంతో స్వాగతం పలికారు. రూ.2.80 కోట్లతో అండర్ డ్రైనెజి ఏర్పాటుతో మురుగునీటి ప్రవాహానికి శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. 45రోజుల్లో పనులు పూర్తయ్యే విధ ంగా చూడాలని ఎంఎల్ఏ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్‌పల్లి ఈశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, సక్కూర్ ధనంజయరెడ్డి, ఏజిపల్లి బాల, వీరంగారి రమేష్‌రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, శానంబట్ల తులసిరెడ్డి, జనసేన నాయకుడు తపసి మురళిరెడ్డి, మండలం లోకేష్ రాయల్, మంగాపురం భాస్కర్ రాయల్, ప్రభాకర్ నాయుడు, బాలకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి : జిల్లా ఎస్పి



తిరుపతి కార్పొరేషన్, జనవరి 27 ప్రభాతవార్త : జిల్లాలో సాయుధ దళం నందు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మీపతి అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చిన జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన రాజు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ, పోలీసు కుటుంబానికి తన సానుభూతిని తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం ఎల్లప్పుడూ తమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేసారు. ఈ కార్యక్రమానికి ఏఓ సురేష్ బాబు, బి సెక్షన్ సూపరిండెంట్ వెంకటేశు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఎం. సోమశేఖర్ రెడ్డి దివంగత పోలీసు కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి 45 అర్జీలు : అదనపు కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 27 ప్రభాతవార్త : ప్రజల నుండి వచ్చే వినతుల పరిష్కారమే మనందరి లక్ష్యమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 8 మంది, మరో 45 మంది వినతులు ద్వారా సమస్యలను విన్నవించారని అదనపు కమిషనర్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి,డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి, డి.ఈ.లు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## వచ్చేనెల 4న కాణిపాకంలో రథ సప్తమి వేడుకలు

కాణిపాకం, జనవరి 27 ప్రభాతవార్త: వచ్చేనెల 4న కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించ నున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిశోర్ తెలిపారు. ఈకార్యక్రమంలో కాణిపాకం పరిసర గ్రామాల ప్రజలు, ఉభయదారులు,భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. 29న కాణిపాకంలో తై అమావాస్య వేడుకలు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 29న తై అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిశోర్ తెలిపారు.


